సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 20 । నవంబర్ । 2023



వారసత్వ సంపదను రక్షించుకుందాం!
వైఎస్సార్ జిల్లాలోని ఘనమైన వారసత్వ సంపద రక్షించుకోవాలని చరిత్రకారులు చెబుతున్నారు. -8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
పుల్లంపేట మండలం పుత్తనవారిపల్లి సమీపంలో మినీ వ్యాను, బైకు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.380
రెండోరకం	రూ.200	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 255 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	310	465
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 364.420 కిలోలు

న్యూస్‌రీల్

నేడు స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

22న జగనన్నకు చెబుదాం

ఓబులవారిపల్లె: ఈనెల 22వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీఓ విజయారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు డయల్ యువర్ డీపీటీఓ

రాయచోటి అర్బన్ : డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ప్రజారవాణాధికారి పి.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సమస్యలపై సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ప్రయాణీకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను 8985283211 సెల్ నంబరుకు ఫోన్‌చేసి తెలుపవచ్చునన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని కడప డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం పాలతల, నిత్యపూజకోన, శ్రీశైలంలకు ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

కడప కల్చరల్: రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు కడప నగర పర్యటనలో భాగంగా స్థానిక అమీన్‌పీర్ దర్గా,దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. తొలుత పెద్దదర్గాను దర్శించుకున్నారు. దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్ వారికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ ఆయన సతీమణితోపాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.దర్గా ప్రతినిధులు దర్గా శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆయన దేవునికడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం శ్రీ పద్మావతి మాతను దర్శించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వ్యక్తులను శక్తులుగా మార్చే గ్రంథాలయాలు

కడప కల్చరల్: గ్రంథాలయాలు ఎందరో సాధారణ వ్యక్తులను సామాజిక శక్తులుగా తీర్చిదిద్దే నిలయమని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సభ ఆదివారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకర్తలు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమ రావుల చిత్రపటాలకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వచ్చేనెల 8 నుంచి సమ్మెబాట

ప్రొద్దుటూరు: డిసెంబర్ 8 నుంచి అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఎన్జీఓ హోంలో ఆదివారం అసోసియేషన్ జిల్లా ఆఫీసు బేరర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ మూడు యూనియన్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 20 నుంచి దశల వారి ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. 20న ఐసీడీఎస్ ప్రాజెక్టులలో సమ్మె నోటీసు ఇవ్వడం, 23న రౌండ్ టేబుల్ సమావేశం, ఆర్డీఓకు వినతి పత్రం, 25 నుంచి 30వ తేదీ వరకు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడం, డిసెంబర్ 7న నల్లబ్యాడీలతో విధులకు హాజరవుతామని చెప్పారు.

సామాజిక విప్లవం

- వైఎస్ జగన్ సర్కార్‌లో బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి విశేష కృషి
- ప్రతి పేదవాడి తలుపు తట్టిన సంక్షేమ పథకాలు
- నేడు వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో సామాజిక సాధికారత యాత్ర



సాక్షి ప్రతినిధి, కడప: సామాజిక మార్పు, అణగారిన వర్గాల అభ్యున్నతి...ఇది ఒకప్పుడు మాటలకే పరిమితం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వీటిని ఆచరణలో చూపెట్టింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు పల్లకీ మోసే బోయీలుగా మిగిలి పోకూడదని సంకల్పించింది. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకా ల్లో అత్యధిక భాగస్వామ్యమిచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమున్నత గౌరవం కట్టబెట్టింది. ఆదరించిన ప్రజలకు అండగా నిల్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా శ్రమించారు. నాలుగున్నరేళ్ల పాలనలో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7,984.48 కోట్లు అందించారు. అందులో ఎస్సీలకు రూ.2,000.92 కోట్లు, ఎస్టీలకు రూ.212.47 కోట్లు, బీసీలకు రూ.5,263.09 కోట్లు, మైనార్టీలకు రూ.508 కోట్లు దక్కింది. జిల్లాలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ఇంత పెద్దఎత్తున సంక్షేమం లభించిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉందని విశ్లేషకులు వివరిస్తున్నారు. అదే విషయమై చేసిన మేళ్లు చెప్పుకునేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఏకమయ్యాయి. ఆమేరకు సామాజిక సాధికార యాత్రను సోమవారం మైదుకూరు కేంద్రంగా నిర్వహించనున్నారు.



మైదుకూరులో సామాజిక సాధికార సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రూ.1,285 కోట్ల లబ్ధి

మైదుకూరు నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ పథకాలు వల్ల డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.1,285.28 కోట్లు అందించింది. నవరత్నాలు పథకాల్లో భాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన 1,38,099 మందికి సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా (డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) అందించింది. వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 88,677 మంది ఉన్నారు. వీరికి రూ. 787.36 కోట్లు సంక్షేమ పథకాల రూపేనా లబ్ధి చేకూరింది. అందులో బీసీలకు రూ.478.34 కోట్లు, ఎస్సీలకు రూ. 232.23 కోట్లు, ఎస్టీలకు రూ.21.06 కోట్లు, మైనార్టీలకు రూ.55.73 కోట్లు అందించారు. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.334.10 కోట్లు అందింది. మొత్తంగా పరిశీలిస్తే రూ.1,619.38 కోట్లు సీఎం వైఎస్ జగన్ సర్కార్‌లో మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు చేరింది.

బడుగుల ఓట్లపైనే టీడీపీ శ్రద్ధ...

తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీనవర్గాల ఓట్లపై ఉన్న శ్రద్ధ వారి ఉన్నతి పట్ల ఏమాత్రం చూపెట్టదని పరిశీలకులు వివరిస్తున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే బీసీ జపం చేస్తూ, ఆపై యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేస్తోందని, ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యేదని పలువురు అంటున్నారు. రాజ్యాధికారం, సంక్షేమంలో సముచిత స్థానం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ విఫలమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్ల కంటే అధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు అప్పగించి చరిత్ర సృష్టించిందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆత్మగౌరవం కోసం....

రాబోయే ఎన్నికల్లో పెత్తందారులను పేదలంతా కలిసి దీటుగా ఎదుర్కోవాలని వివరించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సర్వసన్నద్ధులయ్యారు. ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసిన తెలుగుదేశం పార్టీ ఓవైపు, సామాజిక స్థాయి, ఆర్థిక ఉన్నతి పెంచిన వైఎస్సార్‌సీపీ మరోవైపు ఉన్న నేపథ్యంలో ఆత్మగౌరవం నిలుపుకునేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకు చెందిన నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. బడుగులకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని కోరుతూ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర సోమవారం మైదుకూరులో నిర్వహిస్తున్నారు. కెఎస్‌సీ కల్యాణమండపం నుంచి కార్లు ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్లు కూడలి సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలు హాజరవుతున్నారు.

సమున్నత గౌరవం...

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు సమున్నత గౌరవం దక్కింది. డిప్యూటీ సీఎం హోదా కడప ఎమ్మెల్యే ఎస్‌బి అంజద్‌బాషాకు దక్కింది. మరో ముస్లి మైనార్టీ నేత జకియా ఖానమ్‌కు ఎమ్మెల్సీ ఇస్తూనే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ హోదా కల్పించారు. బీసీలకు చెందిన రమేష్‌యాదవ్‌కు ఎమ్మెల్సీ లభించింది. మైదుకూరుకు చెందిన మదీనా దస్తగిరిని జిల్లా వక్స్‌బోర్డు చైర్మన్‌గిరి దక్కింది. అలాగే జగనన్న అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, ఫించన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కల్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా జిల్లాలోని 19,54,575 మందికి రూ.12,061 కోట్లు లబ్ధి చేకూరింది. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 12,86,500 మంది ఉన్నారు. ఆయా వర్గాలకు రూ.7,984.48 కోట్లు నేరుగా లభించింది.

వైఎస్ జగన్ వల్లే ముస్లింలకు న్యాయం



ముస్లింలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో గుర్తింపు లభించింది. ఆయన హయాంలోనే 5శాతం రిజర్వేషన్ కల్పించారు. తర్వాత వీరిని ఏ నాయకులు పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ వల్ల ముస్లింలకు మంచి జరుగుతోంది. డిప్యూటీ సీఎం హోదాతో పాటు అనేక పదవులు వచ్చాయి. సామాజిక సాధికారతను సీఎం జగన్ ఒక్కరే పాటిస్తున్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా మైదుకూరు నియోజకవర్గంలోని తనను గుర్తించి పదవి ఇచ్చారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.
-మదీనా దస్తగిరి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, మైదుకూరు

అన్ని రంగాల్లో దళితులకు అవకాశం



మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వైఎస్ జగన్ ప్రభుత్వం దళితురాలికి అవకాశం కల్పించింది. పందిటి శోభను మూడేళ్ల పాటు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. రాజకీయాల్లోనే కాకుండా అన్ని రంగాల్లో దళితులకు ప్రత్యేక గుర్తింపు లభించింది.
-జేష్టాది రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, భీమునిపాడు, దువ్వూరు

బీసీలకు ప్రత్యేక గుర్తింపు లభించింది



ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక గుర్తింపు కల్పించారు. బీసీలంటే వెన కబడిన వారు కాదని, రాజకీయాలకు బ్యాక్ బోన్ అని చెప్పి పదువుల్లో, పనుల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించారు. తన భార్యతో పాటు తాను కూడా మండల అధ్యక్షుడిగా ప్రజా సేవ చేస్తున్నాను.
-తెలిదేల లక్ష్మయ్య, మండల అధ్యక్షులు, కుచ్చుపాప, చాపాడు

గెలిచినా.. ఓడినా మీవెంటే

- ప్రపంచకప్ ఫైనల్‌మ్యాచ్‌కు అనూహ్య స్పందన
- కడప ఆర్ట్స్ కళాశాలలో బిగ్ స్క్రీన్‌పై వీక్షించిన వేలాదిమంది అభిమానులు



కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ స్క్రీన్ ద్వారా లైవ్‌స్ట్రీమింగ్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు

కడప స్పోర్ట్స్: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నిర్వహించిన హై ఓల్టేజ్ తుదిపోరును వీక్షించేందుకు జిల్లా ప్రజలు తరలివచ్చారు. దీనికి తోడు ఆదివారం సెలవుదినం కావడంతో మధ్యాహ్నం నుంచే ఆర్ట్స్ కళాశాల మైదానం క్రీడాభిమానులతో కళకళలాడగా, కడప నగర రహదారులు నిర్మానుష్యంగా మారాయి.. సాయంసంధ్యవేళ ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో మ్యాచ్‌ను వీక్షిస్తూ సందడి చేశారు.. కాగా భారత్ జట్టు విశ్వవిజేతగా నిలవడంలో ఒక్క అడుగు దూరంలో నిలిచిపోగా..కొందరు క్రీడాభిమానులు నిరాశ చెందగా.. యావత్ క్రీడాభిమానులు గెలిచినా..ఓడినా.. మీవెంటే అంటూ భారత్ జట్టుకు మద్దతుపలికారు. విచ్చేసిన క్రీడాభిమానులకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటుచేసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, కోశాధికారి మహేంద్రారెడ్డి, సభ్యులు సంజయ్‌కుమార్‌రెడ్డి, వై. విష్ణుప్రీతంరెడ్డి, ఎల్. మునికుమార్‌రెడ్డి, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్, విష్ణుమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

భూములతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతుల ప్రజల కోసం సకల హక్కులతో అందజేసిన ప్రభుత్వ భూములలో పంటలు సాగుచేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకోసం విప్లవాత్మక మార్పులను తెచ్చి అసైన్‌మెంట్ భూములను అందజేయడం జరిగిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు భూములకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి ఆ భూములపై సకల హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పేదవారు తనకంటూ ఆస్థి ఉందని సమాజంలో ధైర్యంగా గుండెలపై చేయి వేసుకొని ఉండేలా సీఎం చేశారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో అసైన్డ్ భూములు రెగ్యులైజ్ చట్టం ద్వారా దాదాపు 30 వేల ఎకరాలు అయ్యాయన్నారు. మొదట విడతలో అసైన్‌మెంట్ ద్వారా 1300 ఎకరాలు, రెండో విడతలో 1000 ఎకరాలను డిసెంబర్ 10న అసైన్‌మెంట్ పూర్తి చేసి అందివ్వడం జరుగుతుందన్నారు. సర్వీస్ ల్యాండ్ (మంగలి, కుమ్మరి, మాదిక, ఇమామ్) భూములకు సర్వహక్కులు కల్పించి ఇకపై నాదే ఈ భూమి అనే నమ్మకాన్ని కల్పించారన్నారు. లబ్ధిదారులకు అసైన్మెంట్ పట్టాతో పాటు ఫీల్డ్ మ్యాప్ స్కెచ్ 1బి, ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న వారికి ప్రభుత్వం పట్టాలు అందిస్తోందని, లబ్ధిదారులు ఇది గ్రహించి ఏ ఒక్కరికీ లంచాలు ఇవ్వనవసరం లేదన్నారు. పట్టాల పేరుతో లబ్ధిదారుల దగ్గర లంచాలు, మామూళ్ల వసూలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే కొత్త చట్టాలను తీసుకువచ్చి చుక్కల భూములకు విముక్తి కల్పించిన ఘనత కూడా ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. దీని ద్వారా కొన్ని వేల మంది రైతులకు న్యాయం జరగడం ఒక చరిత్రగా నిలిచిపోతుందన్నారు. రాయచోటి నియోజకవర్గంలోనే డీకేటీ రెగ్యులైజ్ ద్వారా 30 వేల ఎకరాలు, చుక్కల భూములు ద్వారా 6 వేల నుంచి 7 వేల ఎకరాలు, అసైన్‌మెంట్ ద్వారా 2 వేల ఎకరాల భూములకు పట్టాలు అందుతుండడం రాయచోటి నియోజకవర్గ చరిత్రలో ఒక రికార్డుగా నిలుస్తుందన్నారు.

కందకం.. రైతుకు వరం

- ఉపాధి హామీలో కొత్త పథకం
- మామిడి తోటల్లో వృత్తాకార, చతురస్రాకార కందకాలు ఏర్పాటు

గుర్రంకొండ: ఉపాధిహామీలో కొత్తపథకం ఇప్పుడిప్పుడే రైతుల దరి చేరుతోంది. మామిడి తోటల్లోని మామిడి చెట్లకు వృత్తాకారా లేదా చతురస్రాకార కందాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నారు. ఒక చెట్టుకు ప్రభుత్వం రూ.1,525 వరకు చెల్లిస్తోంది. ఎకరం మామిడి తోట ఉన్న రైతుకు గరిష్టంగా రూ. 1,06,750 వరకు ఆదాయం సమకూరుతోంది. వృత్తాకార కందకాల ద్వారా మామిడి చెట్లు మంచి పోషకాలతో కూడిన అభివృద్ధి సాధిస్తాయి. ఈ పథకం మామిడి రైతులకు మంచి ఫలితాలను అందించనుంది.

జిల్లాలో 7632 ఎకరాల్లో ప్రారంభమైన పథకం
అన్నమయ్య జిల్లాలో మొత్తం 18,331 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వృత్తాకారలేదా చతురస్రాకార కందకాలు ఏర్పాటు పథకం ప్రస్తుతం 7,632 ఎకరాల్లో ప్రారంభమైంది. అన్ని నియోజకవర్గాల్లోని మామిడి తోటల్లో రింగ్ ట్రెంచ్ (వృత్తాకార కందకాలు)ఏర్పాటు ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతోంది. రైతులు ఈ పథకంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఈ పథకం అమలుకు మొగ్గు చూపుతున్నారు.

రైతుకు ఎకరానికి రూ.1,06,750 ఆదా:
ఉపాధి ద్వారా మామిడి తోటల్లో వృత్తాకార కందకాలు ఏర్పాటు చేసే పథకంతో మామిడి రైతుకు ఎకరానికి రూ. 1,06,750 ఆదా అవుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరానికి 70 మామిడి చెట్లు పెంచాల్సి ఉంటుంది. ఒక్కో చెట్టుకు ప్రభుత్వం ఒక క్యూబిక్‌మీటరుకు రూ: 305 చొప్పున ఐదు క్యూబిక్‌మీటర్ల మేరకు రూ.1525 రైతుకు చెల్లిస్తుంది.



రింగ్ ట్రెంచ్‌ల ఏర్పాటుతో మామిడిచెట్టు మొదలు బలంగా కనిపిస్తున్న దృశ్యం



మామిడితోటల్లో రింగ్‌ట్రెంచ్ పనులు చేస్తున్న కూలీలు

ఈలెక్కన ఎకరానికి ఎంతలేదన్నా రూ.1,06,750 ఆదాయం రైతులకు వస్తోంది.

ఒక మొక్కకు 5 క్యూబిక్ మీటర్లు
ఉపాధి హామీ పథకంలో ఒక మామిడి మొక్కకు ప్రభుత్వ నిబంధనల మేరకు 5 క్యూబిక్‌మీటర్ల మేరకు పనిచేసిన కొలతలు తీసి డబ్బులు చెల్లిస్తారు. ఒక మామిడి చెట్టుకు చుట్టూరా నిబంధనలమేరకు ఒక మీటరు పొడవు/వెడల్పు/ లోతు మట్టిని తీయాల్సి ఉంటుంది. మామిడి మొక్క ఎదుగుదల వెడల్పును బట్టి కొలతలు మార్చుకోవచ్చు. ఒకమీటరు నుంచి రెండు మీటర్ల మేరకు పొడవు /వెడల్పు/ దానికి తగ్గట్టుకు అర్థ అడుగు మేరకు లోతుతో కందకాలు తవ్వుకోవచ్చు. ఎలా పనిచేసినా నాలుగు నుంచి ఐదు క్యూబిక్‌మీటర్ల మేరకు కూలీలకు డబ్బులు చెల్లిస్తారు.

వర్షపు నీటి నిల్వతో మంచి పోషకాలు: వృత్తాకార కందకాలు (రింగ్ ట్రెంచ్) మామిడి చెట్లకు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపునీటి నిల్వలతో చెట్టుకు మంచి పోషకాలు లభిస్తాయి. కందకాలు లేక పోతే చెట్టు దగ్గర వర్షపునీరు నిలిచే పరిస్థితి ఉండదు. రింగ్ ట్రెంచ్‌ల ఏర్పాటుతో వర్షపు నీరు మొత్తం కందకాల్లో చేరి నిండిపోతుంది. దీంతోపాటుగా కుళ్లిన ఎరువులు కందకాల్లో చేరతాయి. నీటి వసతితోపాటు ఎరువులు కూడా సమృద్ధిగా చెట్టుకు లభిస్తాయి. తద్వారా మామిడి చెట్టు ఎటువంటి రసాయనిక ఎరువులు వినియోగించకుండానే సేంద్రియ ఎరువులతో మంచి ఎదుగుదల చెందుతుంది. దీనికి తోడు మామిడి చెట్టు మొదట్లో పెద్ద ఎత్తున మట్టి వేయడం వలన తుఫాను, ఈదురు గాలుల నుంచి తట్టుకొని నిలబడే శక్తి చెట్టుకు వస్తుంది.

జిల్లాలో మామిడితోటల వివరాలు (ఎకరాలలో..)

నియోజకవర్గం	మామిడి తోటలు
పీలేరు	3,125
మదనపల్లె	2,768
తంబళ్లపల్లె	3,154
రాయచోటి	3,385
రాజంపేట	2,963
రైల్వేకోడూరు	2,936

కందకాల ఏర్పాటుకు ఇదే అదను
మామిడితోటల్లో రింగ్‌ట్రెంచ్ల ఏర్పాటుకు ఇదే మంచి అదను అని రైతులు అంటున్నారు. మామిడి కాయలు కోసిన తరువాత పూత పట్టే సమయంకు మధ్యలో ఈ సీజనే కందకాల ఏర్పాటుకు మంచి అదనుగా ఉంటుంది. నవంబర్, డిసెంబర్‌లలో ఈ పథకం సద్వినియోగం చేసుకోవడం వలన చెట్టుకు పూత ఏర్పడేందుకు ఎటువంటి ఆటంకాలు ఉండవు.

ఎంతో మేలు



మామిడి తోటల్లో కందకాలు రైతులే చేసుకొంటే ఎంతోమేలు జరుగుతుంది. ఈ పథకం ద్వారా పనులు చేయడానికి రైతుకు ఎటువంటి ఖర్చు ఉండదు. రైతులకే ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉంటే వారు స్వయంగా ఈ పనులు చేసుకొనే అవకాశముంది. ఒక కుటుంబంలో ఐదు మంది పనిచేసే వారుంటే చాలా రోజులు ఉపాధి దొరికినట్లే. తద్వారా ఎకరానికి రూ.1,06,750 ఆదాయం అదనంగా సమకూరుతుంది. -నరసింహులు, మామిడిరైతు, కొత్తపల్లె

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మామిడి మొక్కలకు కందకాలు ఏర్పాటు చేసుకొనే పథకాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధిహామీ కింద ఇప్పుడిప్పుడే ఈపథకం అమలు అవుతోంది. దీని ద్వారా మామిడి రైతులతో పాటు కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఎకరం మామిడితోటల్లో రైతులు స్వయంగా ఈ పనులు చేసుకోవాలంటే రూ.1.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ డబ్బులు ప్రభుత్వం ఈపథకం ద్వారా ఇస్తుంది. - జయరామిరెడ్డి, ఏపీఓ, గుర్రంకొండ

క్లుప్తంగా

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ కాలనీకి చెందిన ఆరే రత్నమ్మ అనే మహిళ మెడలో మూడు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితురాలి కథనం మేరకు.. జెడ్‌హెచ్‌డీసీ కాలనీకి చెందిన రత్నమ్మ చిన్నఓరంపాడు అడ్డరోడ్డు నుంచి రాజంపేటకు వెళ్లేందుకు బస్సుకోసం వేచివుండగా గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కారును నిలబెట్టి రత్నమ్మను కారులో ఎక్కించుకున్నారు. కొద్దిదూరం ప్రయాణం అనంతరం మెడలో మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని ఆమెను కారు నుంచి బయటకు తోసేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. మోతీనగర్‌కు చెందిన బాబు కుమార్తె ఎస్.జుబియా(19) తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో విషద్రావణం తాగి ఇంటివద్దే ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు యువతిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. ఊలపాడుకు చెందిన జి.నాగభూషణం(31) అదే గ్రామానికి చెందిన డి.మధుసూదన్(23), పుంగనూరుకు చెందిన ఆర్.సునీల్(26)తో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న నాగభూషణం తండ్రి వెంకటరమణకు భోజనం అందించి తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా, పుంగనూరు మండలం పూజగానిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి ముగ్గురు కిందపడ్డారు. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

108లో ప్రసవం



పురిటిబిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

నిమ్మనపల్లె : ఓ మహిళ 108 వాహనంలో బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. తవళం పంచాయతీ చింతలవారిపల్లెకు చెందిన ఎస్.రాజు భార్య మల్లి(20) మూడో కాన్పులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 15 నిమిషాలలోపే పైలట్ సూరిబాబు, ఈఎన్‌టీ రెడ్డిజశ్వంత్ గ్రామానికి చేరుకున్నారు. ఆమెను 108 వాహనంలో నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలోని బుచ్చిరెడ్డిగారిపల్లె వద్ద వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ప్రసవానంతర చికిత్స కోసం నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించారు.

మినీబస్సు - ఆటో ఢీ



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప



ప్రమాదస్థలంలో శ్యామల మృతదేహం





ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పుష్పలత, చిన్నపాప

మహిళ మృతి, ఆరుగురికి గాయాలు

నిమ్మనపల్లె : మినీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందింది. ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె నుంచి మదనపల్లెకు మినీ బస్సు ప్రయాణికులతో అతివేగంతో వస్తూ, మదనపల్లె నుంచి నిమ్మనపల్లెకు ప్రయాణికులతో వెళుతున్న అపే ఆటోను రాచవేటివారిపల్లె దిగువమాచిరెడ్డిపల్లె చెరువుకట్టమీద ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తవళం పంచాయతీ ఎగువపల్లె గ్రామానికి చెందిన టేకుమంద రాజేంద్ర భార్య టి.శ్యామల(27) ఘటనాస్థలంలోనే మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న చీకలబైలు పంచాయతీ రాగిమాకులపల్లెకు చెందిన చిన్నపాప(65), మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ కట్టుబావికి చెందిన పుష్పలత(24), నిమ్మనపల్లె మండలం ముష్ఠూరుకు చెందిన ఇ.శివయ్య(45), దేవళంకురప్పల్లెకు చెందిన నరసమ్మ(45), నిమ్మనపల్లెకు చెందిన పి.మంజుల(20)తో పాటు ఆటో డ్రైవర్ బి.హేమంత్‌కుమార్(28)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పుష్పలత, చిన్నపాప తీవ్రంగా గాయపడగా, మెరుగైన చికిత్సకు వారిని తిరుపతికి రెఫర్ చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ కేశప్ప, రూరల్ సీఐ శివాంజనేయులు, నిమ్మనపల్లె ఎస్ఐ రామకృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా మృతురాలు శ్యామలకు ఇద్దరు కుమార్తెలు భారతి(8), దివ్య(6) ఉన్నారు. సమాచారం అందుకున్న భర్త రాజేంద్ర, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

ఒకరికి తీవ్ర గాయాలు



హుస్సేన్ (ఫైల్)



నారాయణ (ఫైల్)

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి పుత్తనవారిపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం మినీ వ్యాను, బైకు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లంపేట మండలం, శ్రీరాములపేటకు చెందిన ఈశ్వర్(20), నారాయణ (21), హుస్సేన్ (17) ముగ్గురు జీవనోపాధి నిమిత్తం రాజంపేటలోని పెప్సీ గోడౌన్‌లో పనిచేసేవారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో పుత్తనవారిపల్లి సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీ కొనడంతో నారాయణ, హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందారు. పుల్లంపేట ఎస్ఐ రఘురాం సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అలాగే గాయపడిన ఈశ్వర్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు కూడా మోక్షం లభించింది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు, సొంత ఇళ్లు, మెరుగైన విద్య అందుతోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సర్టిఫికెట్లు అన్నీ ఇచ్చారు



జగనన్న సురక్ష క్యాంపులో నాకు అవసరమైన కుల,ఆదాయ సరిఫికెట్లతో పాటు రేషన్ కార్డు అందజేశారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది నా నుంచి వివరాలు తీసుకుని అందించారు. గతంలో ఇలాంటి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుని రోజుల తరబడి పనులు వదిలేసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా నాకు అన్ని పత్రాలు అందజేశారు. గత పాలకులకు భిన్నంగా సీఎం జగన్ ఇలాంటి మంచి పనులు చేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

-ముబారకున్నీసా, బాపనకాలువ, మదనపల్లె

సొంతగూడు నిర్మించుకున్నాం



జగనన్న ప్రభుత్వం తోడ్పాటుతో సొంతగూడును నిర్మించుకోగలిగాము. ఎన్నో ఏళ్లుగా పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. సిఫారసులు ఉంటేనే గృహం మంజూరయ్యేది. జగనన్న ప్రభుత్వంలో ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హతే ఆధారంగా జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం గృహనిర్మాణానికి మంజూరు చేసిన రూ.1.80లక్షలతో పాటు స్వయంగా కొంత మొత్తాన్ని వేసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. కాలనీలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు. జగనన్న పుణ్యమా అని సొంతగూడు నిర్మించుకోగలగడం చాలా సంతోషంగా ఉంది.

- ఎం.సరస్వతి, లబ్ధిదారురాలు, రాయచోటి

దశాబ్దాల సమస్య పరిష్కారం



ఉన్నత పాఠశాలలో దశాబ్దాలుగా తరగతి గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడి విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న సీఎం అయిన తరువాత నాడు-నేడుతో పాడుబడ్డ తరగతి గదులను తొలగించి రూ. 49 లక్షల రూపాయలతో నూతనంగా ఐదు తరగతి గదులను నిర్మించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో తెచ్చిన పెను మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడటంతో విద్యార్థుల శాతం పెరగడంతో పాటు ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది.

-బుక్కే రాజు నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఓబులవారిపల్లె

అదుపుతప్పి ఆటో బోల్తా

- సత్యసాయిజిల్లా వాసికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఇంద్రవెల్లి

బి.కొత్తకోట : బైకుకు దారి ఇవ్వబోయి అదుపుతప్పిన ఆటో బోల్తా పడగా ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలు. సత్యసాయిజిల్లా తనకల్లు మండలం ఉస్తినపల్లెకు చెందిన వ్యాపారి ఇంద్రవెల్లి (50) బి.కొత్తకోట వారపుసంతలో సరుకులు విక్రయించుకునేందుకు ఆటోలో నిత్యావసర సరుకులతో బయలుదేరాడు. ఆటో స్థానిక పీటీఎంరోడ్డులోని ఈద్గా సమీపంలోకి రాగానే ఎదురుగా బైక్ వస్తుండగా దారి ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీనితో ఆటోలోని ఇంద్రవెల్లి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని స్థానిక ఆస్పత్రికి, తర్వాత మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు సూచించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.

సంబేపల్లెలో..

- 8 మందికి గాయాలు



బోల్తాపడిన ఆటో

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లి రోడ్డులోని గంగన్నగారిపల్లె–తాటికుంట దళితవాడకు వెళ్లే క్రాస్ మధ్యలో ఉన్న మలుపు వద్ద ఆదివారం ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో 8 మంది కూలీలకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు శెట్టిగుంటపల్లి గ్రామం, బుర్రవాండ్లపల్లి, ఆగలివీడులకు చెందిన కూలీలు సంబేపల్లెకు కూలి పని నిమిత్తం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కళావతి, గంగాదేవి, కుమారి, రజని, అరుణ, రమణమ్మ, కళ్యాణి, లక్షుమక్క, మల్లికార్జునలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం రమణమ్మ, అరుణను కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీకి ఎంపిక



శ్రీతేజ్‌ను అభినందిస్తున్న సీఐ మధుసూదన్ రెడ్డి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి శ్రీతేజ్ జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ శారద తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో శ్రీతేజ్ ఎంపికయ్యాడన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి బేస్‌బాల్ క్రీడాపోటీలలో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు వారు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీతేజ్‌ను రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి అభినందించారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపు



డ్రిల్లు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–12 ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో భాగంగా ఆదివారం కేడెట్స్‌కు ఆయుధ శిక్షణ, మ్యాప్‌రీడింగ్, డ్రిల్లు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. శిక్షణలో ఆయుధాలను విడదీయడం, తిరిగి జోడించడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ మహేష్, రాజు, పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిష్నోయ్, సి.ఎల్.రెడ్డి, జగదీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలపై కడప డీఎస్పీ ఎం. షరీఫ్ పర్యవేక్షణలో సీఐ తబ్‌రేజ్, ఎస్ఐ జయరాముడుల ఆధ్వర్యంలో నిఘా పెంచారు. ఆదివారం ఏ–1 నగర్‌లో గంజాయిని విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక్క కిలో బరువున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో షేక్ మహమ్మద్ ఖలీద్, అజ్మత్‌అలీ, మండి వరుణ్‌కుమార్ రెడ్డి, బుక్కే జ్యోతీష్‌నాయక్, షేక్ ఉస్మాన్‌లు వున్నారు. ముఠాలో మరో ఇద్దరు పరారయ్యారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల - కొమరోలు రోడ్డులో కాలువకట్ట సమీపంలోని రాజీవ్‌కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం లారీ ఢీ కొనడంతో నాగదాసరి రాజు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. కాలనీలోని తన ఇంటి నుంచి రాజు బయటకు వచ్చి రోడ్డుపైకి రావడంతో పోరుమామిళ్ల వైపు వస్తున్న లారీ వెనుక నుండి ఢీ కొట్టింది. రాజుకు భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు గీత ఇంటర్, రెండవ కూతురు శృతి పదవ తరగతి చదువుతున్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం తెలియడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోడౌన్‌లో చెలరేగిన మంటలు



గోడౌన్‌లో చెలరేగుతున్న మంటలు

పులివెందులరూరల్ : పట్టణంలోని పాత గంగిరెడ్డి హాస్పిటల్ సమీపంలో ఉన్న పాత గోడౌన్‌లో ఆదివారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు, బ్లూకోర్ట్ సిబ్బంది వెంకటనారాయణ, సునీల్‌లు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ఫైర్ స్టేషన్ అధికారులు తెలిపారు. సుమారు రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

వారసత్వ సంపదను రక్షించుకుందాం!

- జిల్లాలో ఘనమైన వారసత్వ సంపద
- నేటి నుంచి వారసత్వ వారోత్సవాలు



సిద్దవటం కోట



కలమల్లలోని ప్రాచీన తెలుగు శాసనం

కడప కల్చరల్ : మన పెద్దలు ఇచ్చిన ఆస్తిని భద్రంగా కాపాడుకుంటాం. వారి జ్ఞాపక చిహ్నాలను జాగ్రత్త చేసుకుని తర్వాత తరాలకు అందిస్తాం. కానీ జాతికి మొత్తం వారసత్వంగా మన పూర్వీకులు ఇచ్చిన సంపదను మాత్రం పట్టించుకోం. నిజానికి దాని విలువ తెలియకపోవడంతోనే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నాం. గత పాలకులకు సైతం వీటి విలువ తెలియకపోవడంతో వాటిని కాపాడే ప్రయత్నం చేయలేదు. దాంతో అవి క్రమంగా శిథిలమై కనుమరుగయ్యే ప్రమాదానికి చేరుకున్నాయి. సోమవారం నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

గత ప్రభుత్వం టెంపుల్ సర్క్యూట్, హెరిటేజ్ సర్క్యూట్, రూరల్ హెరిటేజ్ సర్క్యూట్ ఇలా ఎన్నో పథకాలను ప్రకటించిందేగానీ అందులో ఒక్కటైనా అమలు చేసే ప్రయత్నం చేయలేదు. జిల్లాలోని అపురూప వారసత్వ సంపదలైన అడపూరు బౌద్ధారామాలను తవ్వేసి దానవులపాడు జైన తీర్థంకరుని విగ్రహాన్ని పగులగొట్టినా పట్టించుకున్న పాపాన పోలేదు. వాటి విలువ తెలియదు గనుకనే అవి కళ్లెదుటే నాశనం అవుతున్నా స్పందించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వారసత్వ సంపద

రాష్ట్రంలో ఇతర ఏ ప్రాంతాలకు తీసిపోని విధంగా మన జిల్లాలో బౌద్ధారామాలు, బుద్ధిజానికి సంబంధించిన అవశేషాలు, శిథిలాలు ఉన్నాయి. నందలూరు సమీపంలోగల అడపూరు గుట్టపై 13 భారీ, చిన్నసైజు ఆరామాలు ఉన్నాయి. నేటికీ చెక్కుచెదరకుండా ఉన్న వీటిని చూసేందుకు స్థానిక ప్రజలతోపాటు పర్యాటకులు కూడా వస్తుంటారు. గుట్ట కింద బౌద్ధ మునులు నివసించినట్లు చెబుతున్న గుహ కూడా ఉంది. ఖాజీపేట మండలం బోసిరెడ్డిపల్లె (వెంకట రామాపురం), ఆంజనేయలకొట్టాల చెరువు (పుల్లూరు)లో బుద్ధుని పాదాలను పరిశోధకులు తవ్వా ఓబులరెడ్డి కనుగొన్నారు. ప్రస్తుతం ఆ పాదాలు కడప మహావీర్ మ్యూజియంలో ఉంచారు. ఇంకోదాన్ని స్థానికుల డిమాండ్ మేరకు అక్కడే ఉంచారు. ఇక్కడ లభించిన పాదాలు రాష్ట్రంలోని ఇతర పాదాల కంటే ఎంతో విశిష్టంగా ఉన్నాయని, పూర్తి స్థాయి బుద్ధిజం ఆనవాళ్లు ఇందులో కనిపిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. పుల్లూరు గ్రామానికి సమీపంలో (ఖాజీపేట మండలం) నాగనాథేశుని కొండపై కూడా బౌద్ధం విలసిల్లినట్లు తెలుస్తోంది. ఇక్కడ కూడా బుద్ధుని పాదాలతోపాటు మరికొన్ని బౌద్ధ శిథిలాలు వెలుగుచూశాయి. మూడు, నాలుగు శతాబ్దాల కాలంలో జిల్లాలో బౌద్ధమతం ఎంతో ప్రాచుర్యంలో ఉండిందని చరిత్రకారులు చెబుతున్నారు. నందలూరు గుట్టపై బౌద్ధ స్థూపాలు, చైతన్య గుహం, విహారాలు, ఇటుకలతో నిర్మించిన వేదికలు వెలుగుచూశాయి. వీటిని రాష్ట్ర పురావస్తుశాఖకు చెందిన పలువురు అధికారులు కూడా వచ్చి చూశారు. బుద్ధునికి సంబంధించిన విలువైన సమాచారం తెలుపుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఖాజీపేట, పుల్లూరు ప్రాంతాలలో లభించిన బౌద్ధ ఆనవాళ్లు ఎంతో విలువైనవని, ప్రాముఖ్యత గలవని పురావస్తుశాఖ అధికారులే స్పష్టం చేశారు. వీటిని పరిరక్షించి రాష్ట్రంలోని ఇతర బుద్ధ సర్క్యూట్‌లకు కలిపితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి కావడమేగాక బౌద్ధ ఆరామాలు, ఇతర శిథిలాలు, నిర్మాణాలు కాపాడి భావి తరాలకు ఘనమైన వారసత్వ సంపదను అందించవచ్చని ప్రభుత్వం వీటి రక్షణ కోసం పురావస్తుశాఖ ద్వారా అవసరమైన చర్యలు చేపడుతోంది. గండికోటలో మరమ్మతులు, సిద్దవటం కోటలో కూలిన బురుజుల మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లాకు ప్రతిష్టాత్మక వారసత్వ సంపదగా నిలిచి ఉన్న పాత కలెక్టరేట్ భారీ భవనాన్ని సంరక్షించుకునేందుకు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడంతో ఇప్పటికే మరమ్మతు పనులు కొనసాగుతుండడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జైన వారసత్వ సంపద

జిల్లాలో జైన మతం కూడా విలసిల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. జమ్మలమడుగు సమీపంలోని నది ఒడ్డున దానవులపాడులో జైన భవనాల పునాదులు, మందిరం, అందులో తీర్థంకరుని విగ్రహం, నది అంచున మెట్లు, ఇరువైపులా స్నాన ఘట్టాల రేయిలింగ్, కొద్దిదూరం రాతి నిర్మాణం, వారసత్వ సంపదగా నేటికీ నిలిచి ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం ఎంతో వైభవం చవిచూసిందని, చరిత్రలో ఎంతో ప్రాధాన్యత ఉండేదని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఇంకా గ్రామం చివర 'పాడు' అన్న పేరుతో ఉన్న పలు గ్రామాలు కూడా బౌద్ధమతం విలసిల్లిన ప్రాంతాలేనని స్పష్టం చేస్తున్నారు.

విలువైన జాతి సంపద

నిజానికి వైఎస్సార్ జిల్లాలో ఉన్నంత విలువైన, ఘనమైన వారసత్వ సంపద మరే జిల్లాలోనూ లేదన్న మాట అక్షర సత్యమని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. వీటిని రక్షించుకుంటే భావి తరాలకు గొప్ప సంపదను అందించిన వారమవుతామని వీటి రక్షణ బాధ్యత ప్రజలందరిపై ఉందంటున్నారు. గండికోట లాంటి ఘనమైన వారసత్వ కట్టడాన్ని రక్షించేందుకు ఇప్పటికే ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. వందలాది పురాతన ఆలయాలను సెంటిమెంటు కారణంగా ప్రజలే రక్షించుకునేందుకు ప్రయత్నిస్తారు. కనుక వాటి గురించి కూడా ఇబ్బంది ఉండదు. కానీ బౌద్ధారామాలు, జైన ఆరామాల లాంటి విషయంలోనే జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. వెయ్యేళ్లపాటు పెన్నానది ఒడ్డున ఇసుకలో పూడుకుపోయి ఇటీవలే శ్రీశైలం దేవస్థానం ప్రతినిధుల తవ్వకాలలో బయల్పడిన సిద్దవటం వద్దగల జ్యోతి గ్రామంలోని జ్యోతీశ్వరస్వామి ఆలయం, రాజగోపురం, ఇతర ఆలయాలు, మందిరాలు వందలాది శివలింగాలు, ప్రాకారం కూడా మనకు ఘనమైన వారసత్వ సంపదలే. వాటిలో ఇప్పటివరకు జ్యోతిలింగేశ్వర ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. కానీ అది క్రమంగా శిథిలమవుతోంది. తెలుగుభాష ప్రాచీనతను తెలిపే కలమల్ల తెలుగు శాసనాన్ని కూడా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.